సాక్షి నిర్మల్
గురువారం । 23 । జనవరి । 2025



పక్షుల లెక్క పక్కా 8లో▶

జన్నారం అటవీ డివిజన్‌లో పక్షుల గణనకు అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మనుషులు, వన్యప్రాణుల లాగే పక్షులను పక్కాగా లెక్కించాలని యోచిస్తున్నారు.



అధ్వానంగా పుష్కరఘాట్లు

బాసరలోని గోదావరి పుష్కరఘాట్లు చెత్తాచెదారంతో నిండి అధ్వానంగా మారాయి. ఆలయ అధికారుల వెంటనే స్పందించి శుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు. 9లో▶

గరిష్టం/కనిష్టం 32.0 / 17.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో మానసికోల్లాసం



క్యారమ్ ఆడుతున్న జిల్లా జడ్జి కర్ణకుమార్

నిర్మల్‌టౌన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా జడ్జి కర్ణకుమార్ పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా న్యాయవాదులకు బుధవారం క్రీడాపోటీలు నిర్వహించగా జిల్లా జడ్జి పాల్గొని మాట్లాడారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్‌కుమార్, గవర్నమెంట్ ప్లీడర్ బీ శుభకరన్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వీ మహేందర్, ఉపాధ్యక్షురాలు కవిత, లైబ్రరీ సెక్రటరీ సీహెచ్ అర్చన, స్పోర్ట్స్ సెక్రటరీ వంశీ, న్యాయవాదులు శ్యాంసుందర్‌రెడ్డి, గంగాధర్, రమణారావు, నవీన్, నరేందర్, రమణ, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



దిల్దార్‌నగర్ గ్రామంలో మామిడి తోటను పరిశీలిస్తున్న స్పందన

కడెం: మామిడి పూత, పిందె దశలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ క్లస్టర్ అధికారి స్పందన సూచించారు. బుధవారం మండలంలోని దిల్దార్‌నగర్, లక్ష్మీసాగర్ గ్రామాల్లోని మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పూత వచ్చిన తర్వాత ఎండ వేడిమికి బూడిద తెగులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దీని నివారణకు సల్ఫర్ 80 డబ్ల్యూపీ లేదా హెక్సాకోనాజోల్ మందును నీటితో పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. పిందె రాలడాన్ని నివారించేందుకు పొటాషియం నైట్రేట్, బోరాన్ కలిపి నీటితో పిచికారి చేసుకోవాలని సూచించారు.

అర్హుల ఎంపికకే గ్రామసభలు



అందాకూర్‌లో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: ప్రభుత్వ పథకాల అర్హుల ఎంపికకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డీపీవో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని దౌనెల్లి, లింబా(బి), సూర్యాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో పాల్గొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేశ్‌గౌడ్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఏవో విక్రమ్, ప్రత్యేకాధికారులు విఠల్, ప్రియాంక, నవీన్, అశోక్, పంచాయతీ కార్యదర్శులు రవిప్రసాద్, రాజు, రమ్య, సాయేందర్ తదితరులున్నారు.

రైతు సేవాకేంద్రం పరిశీలన



యంత్రాలను ప్రారంభిస్తున్న అధికారులు

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి గ్రామంలోగల రైతు సేవాకేంద్రాన్ని బుధవారం సుగంధ ద్రవ్యాల బోర్డు అధికారులు పరిశీలించారు. క్యూజీబీజీ పథకం కింద మంజూరైన రెండు పసుపు బాయిలర్లు, రెండు పాలిషర్లను స్పైసెస్ బోర్డు నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్ నటరాజన్, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ రాజమాణిక్యం తనిఖీ చేసి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సుగంధ ద్రవ్యాల బోర్డు వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ నుంచి ఎఫ్‌పీవోలకు 90 శాతం సబ్సిడీతో 10 శాతం వాటా వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతు సేవాకేంద్రం అధికారులు, సిబ్బంది అధికారులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద్‌రావు, సురేశ్, కమల, సుమన్ తదితరులున్నారు.

పాఠశాల సందర్శన

ముధోల్: మండల కేంద్రంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను బుధవారం డీఈవో రామారావు సందర్శించారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంఈవో రమణారెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

బీజేపీ పీఠమెవరిదో!

- అంజుకుమార్‌రెడ్డికి వయస్సు అడ్డంకి
- పరిశీలనలో రవి, రాజేశ్వర్‌రెడ్డి పేర్లు
- ఎమ్మెల్యేల ప్రతిపాదనల్లో ఇతరులు
- జిల్లా అధ్యక్ష పదవి కోసం పైరవీలు
- పార్టీలో కనిపించని ఏకాభిప్రాయం



నిర్మల్: బీజేపీలో జిల్లాపగ్గాలు ఎవరికి దక్కనున్నాయి? అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయాలు నమోదు చేసిన కమలదళాన్ని రానున్న రోజుల్లో ముందుకు నడిపించేది ఎవరు?.. పార్టీతో పాటు జిల్లాలోనూ ప్రస్తుతం ఇదే చర్చ కొనసాగుతోంది. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు సంబంధించి జిల్లా అధ్యక్షుల పేర్లు ఇప్పటికే ఖరారయ్యాయి. ఇక నేడో.. రేపో ఈ పేర్లను ప్రకటించనున్నారు. కానీ, నిర్మల్ జిల్లాకు ఎవరిని అధ్యక్షుడిగా నియమిస్తారనేది ఇంకా తేలడం లేదు. ముందు నుంచీ పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తారా?.. లేక ఎమ్మెల్యేల సిఫార్సులను పరిగణనలోకి తీసుకుంటారా?.. అనేది తేలాల్సి ఉంది. ఓవైపు పార్టీ సీనియర్లు ముందు నుంచి పార్టీలో ఉన్న వారికే ప్రాధాన్యం ఇవ్వాలంటూ వారి పేర్లనే అధిష్టానానికి పంపించారు. మరోవైపు పార్టీపై మరింత పట్టు పెంచుకునేందుకు ఎమ్మెల్యేలు తమకు సంబంధించిన వాళ్లనే అధ్యక్షులుగా నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లా అధ్యక్ష పదవి ఎంపికపై పార్టీలో ఏకాభిప్రాయం కనిపించకపోవడంతో సాధారణ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

తప్పుకొన్న అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్, ముధోల్ ఎమ్మెల్యేలను గెలిపించుకోవడంతోపాటు ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా నుంచి అత్యధిక మెజారిటీని అందించడంతో బీజేపీలో జిల్లాకు ప్రత్యేక పేరు వచ్చింది. ఎన్నికల సమయంలో జిల్లా అధ్యక్షుడిగా పార్టీని విజయవంతంగా నడిపించారని అంజుకుమార్‌రెడ్డి పేరు సంపాదించుకున్నారు. రెండోసారి ఆయననే అధ్యక్షుడిగా కొనసాగించాలనే అభిప్రాయాన్ని సీనియర్ నేతలు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. కానీ, పార్టీ పెట్టిన నిబంధన అందుకు ఒప్పుకోవడం లేదు. మండల, పట్టణాధ్యక్షులు కావాలంటే 45 ఏళ్ల లోపు.. జిల్లా అధ్యక్షుడు కావాలంటే 60 ఏళ్ల లోపు వారై ఉండాలని పార్టీ నిబంధన పెట్టింది. దీంతో 64 ఏళ్ల వయస్సున్న అంజుకుమార్‌రెడ్డికి ఈ నిబంధన అడ్డుగా మారింది. ఈ క్రమంలో ఆయన రేసు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

అధిష్టానం దృష్టికి రెండు పేర్లు

జిల్లా పార్టీ నుంచి ఇప్పటికే అధిష్టానానికి ఇద్దరి పేర్లు పంపించారు. ముధోల్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత రవి పాండే, అలాగే నిర్మల్ నియోజకవర్గం నుంచి ప్రస్తుతం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న సామ రాజేశ్వర్‌రెడ్డి పేర్లు అధిష్టానానికి వెళ్లాయి. వీరిద్దరిలో ఎవరికో ఒకరికి పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని జిల్లా కమిటీ సూచించిన మేరకు అబ్జర్వర్లు అధిష్టానానికి పంపించారు. వీరితోపాటు పలువురు సీనియర్ నాయకుల పేర్లు కూడా చర్చకు వచ్చాయి. కానీ, జిల్లా నుంచి అధిష్టానానికి రవి పాండే, సామ రాజేశ్వర్‌రెడ్డి పేర్లు మాత్రమే వెళ్లాయి. ముందు నుంచి పార్టీలో ఉండటంతో వీరి పేర్లు సూచించినట్లు తెలుస్తోంది.

పట్టు విడువని ఎమ్మెల్యేలు

అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరి ఎమ్మెల్యేలుగా గెలిచిన మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్ కమలదళంపై తమ పట్టును మరింత పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే మండలాల అధ్యక్షులతో పాటు జిల్లా అధ్యక్ష పదవి కూడా తాము చెప్పిన వారికే ఇవ్వాలని పార్టీపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అన్ని జిల్లాల్లో మండల అధ్యక్షుల పేర్లు ఖరారు కాగా, జిల్లాలో 11 మండలాధ్యక్షుల పేర్లు మాత్రమే ఖరాయ్యాయి. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలో చాలా మండలాధ్యక్ష పదవులను పెండింగ్‌లో పెట్టారు. ఇక్కడ కూడా పార్టీ సూచించిన పేర్లు, ఎమ్మెల్యేల సిఫార్సులు వేర్వేరుగా ఉండటంతోనే ఆగినట్లు సమాచారం.

కుదరని ఏకాభిప్రాయం

గతంలో ఎన్నడూ లేనివిధంగా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయబావుట ఎగురవేసింది. అంతటితో ఆగకుండా వరుసగా రెండోసారి ఎంపీ ఎన్నికల్లో జిల్లా నుంచి అత్యధిక మెజారిటీని అందించింది. జిల్లాలో కమలం పార్టీకి కార్యకర్తల కంటే అభిమానులు ఎక్కువగా ఉండటం ఇక్కడ కలిసి వచ్చింది. మరోవైపు పార్టీలో మాత్రం ఇప్పటికీ నాయకుల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడం కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తోంది. తాజాగా జిల్లా అధ్యక్ష పదవి కోసం ఇద్దరు ఎమ్మెల్యేలు సూచించిన పేర్లపై చాలామంది నేతలు, కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ఎస్టీ నాయకుల పేర్లను వారు సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాపై అంతగా పట్టు లేని సదరు నేతల పేర్లను ఎలా సూచిస్తారని కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా పార్టీకి జిల్లాలో మంచి మైలేజీ వచ్చిందని, దీన్ని కాపాడుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా విజయం సాధించాలని నాయకులు, సాధారణ కార్యకర్తలు ఆశిస్తున్నారు. కానీ, పార్టీ సీనియర్లు, ఎమ్మెల్యేల మధ్య ఇప్పటికీ ఏకాభిప్రాయం లేకపోవడం వారిని నిరాశకు గురిచేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ ఎవరిని జిల్లా అధ్యక్షుడిని చేస్తుందో వేచిచూడాల్సిందే.

దుకాణాలపై అధికారుల దాడులు



బాలుడి కుటుంబానికి కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

- బాలకార్మికుడి గుర్తింపు
- యజమానిపై కేసు నమోదు
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

సాక్షి స్పందన

నిర్మల్‌టౌన్/సోన్: 'బాల్యం బందీ' శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని వివిధ దుకాణాలపై ఆపరేషన్ స్మైల్ అధికారులు, సిబ్బంది దాడులు ప్రారంభించారు. నిర్మల్ రూరల్ మండలం డ్యాంగాపూర్, విశ్వనాథ్‌పేట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. గొర్రెల కాపరిగా పనిచేస్తున్న తొమ్మిదేళ్ల బాలుడిని గుర్తించారు. అతడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరిచారు. పనిలో పెట్టుకున్న సిద్దులకుంట గ్రామానికి చెందిన నిఖిల్‌పై కేసు నమోదు చేశారు. తండ్రితో పాటు గొర్రెలు కాస్తున్న మరో బాలుడి కుటుంబానికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా బాలల పరిరక్షణ అధికారి దేవి మురళి ఈ సందర్భంగా హెచ్చరించారు. బాలలను పనిలో పెట్టుకున్నట్లు ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1098కు తెలుపాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ వహీద్, ఆపరేషన్ స్మైల్ ఎస్సై నరేశ్‌కుమార్, సాదిక్, హెడ్ కానిస్టేబుల్ జమీర్, సిబ్బంది శ్రీనివాస్, లక్ష్మణ్, హారిక, లేబర్ డిపార్ట్‌మెంట్ జూనియర్ అసిస్టెంట్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మండల కేంద్రంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని కనకాపూర్‌లోసీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. వడ్యాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ, మూత్రశాలల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాచాపూర్‌లో ముదిరాజ్ సంఘ భవనం, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ.5లక్షలతో చేపట్టిన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చామన్‌పెల్లి, చింతల్‌చాంద, పార్‌పెల్లి, ధర్మారం, పీచర గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. పొట్టపెల్లి (కే) గ్రామంలో చేపట్టిన దుర్గామాత షెడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.2.05లక్షల ప్రొసీడింగ్‌ను గ్రామస్తులకు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన కానుగంటి శంకర్‌కు చికిత్స కోసం మంజూరైన రూ.2లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రూ.4 కోట్లతో మండల కేంద్రం నుంచి సోన్‌కు వెళ్లే రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మండల కేంద్రం నుంచి వైకుంఠధామం వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. ప్రతీ మారుమూల గ్రామానికీ రోడ్డు, తాగునీటి వసతి కల్పిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు రావుల రాంనాథ్, అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి, భూపాల్‌రెడ్డి, చిన్నయ్య, వోస రాజు, సురేశ్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్: ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ జానకీ షర్మిల ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పాత రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పదిమంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'నిర్మల్ పోలీస్.. మీ పోలీస్'లో భాగంగా జిల్లాలో ప్రజలకు పోలీసు సేవలను చేరువ చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే ప్రతీ బుధవారం భైంసా డివిజన్ పరిధిలో ఫిర్యాదుదారుల అర్జీల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు నిర్భయంగా, నేరుగా తనను కలిసి అర్జీలు అందజేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ఉన్నారు.

భద్రత నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో దుర్గాప్రసాద్



సారంగపూర్: చించోలి(బి)లో..

నిర్మల్‌టౌన్: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆర్టీవో దుర్గాప్రసాద్ సూచించారు. జిల్లా కేంద్రంలోని లారీ అసోసియేషన్ వద్ద ఓనర్లు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ.. రోడ్డు సేఫ్టీ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఎక్కువ శాతం అతివేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంవీఐలు మహేందర్, ముర్తూజా అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించాలి

సారంగపూర్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా రవాణాధికారి దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు సమీపంలో బుధవారం ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనచోదకులంతా తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ప్రతీ వాహనానికి తప్పకుండా అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు ఉండాలని తెలిపారు. చాలామంది వాహనచోదకులు బాధ్యతారాహిత్యంతో వాహనాలు నడుపుతుండగా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. వాహనచోదకులు రోడ్డు నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్ అధికారి శివాజీ, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

రెండోరోజూ కొనసాగిన నిరసనలు



స్వర్ణ గ్రామంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం నిర్వహించిన రెండోరోజూ గ్రామసభల్లో మళ్లీ గందరగోళ పరిస్థితి నెలకొంది. మండలంలోని పొట్య, స్వర్ణ, జౌళి, ప్యారమూర్‌కొట్ల(బి) గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు తాము రేషన్‌కార్డులు, రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పేర్లు లబ్ధిదారుల జాబితాల్లో లేవని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది నిరంతర ప్రక్రియ.. మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇస్తాం' అని అధికారులు తెలుపగా శాంతించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, ఎంఈవో మధుసూదన్, ఏవో వాక్వార్ అహ్మద్, వెటర్నరీ డాక్టర్ నంద్‌కుమార్, పీఆర్ ఏఈ దేవిదాస్, ఎంపీవో అజీజ్ ఖాన్, పీఆర్ డీఈ తుక్కారాం తదితరులున్నారు.


పోస్టులెప్పుడిస్తరో!

- వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీకి ఏడాది క్రితమే నోటిఫికేషన్
- దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటికీ చేపట్టని నియామకాలు
- నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో వివిధ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించి ఏడాదైనా నియామకాలు చేపట్టడం లేదు. వివిధ ప్రోగ్రాంలలో నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించేందుకు గత మార్చి ఒకటిన నోటిఫికేషన్ విడుదల చేసి ప్రక్రియ పూర్తిచేశారు. ఇప్పటికీ మెరిట్‌లిస్ట్ ప్రకారం పోస్టులనూ ఇవ్వడం లేదు. దీనిపై సంబంధిత అధికారులూ సరైన సమాధానం చెప్పడం లేదు. ఇది విమర్శలకు తావిస్తోంది. ఇదే సమయంలో ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో పరిధిలోనూ ఇవే పోస్టులకు నోటిఫికేషన్ వెలువడగా పోస్టులు కూడా భర్తీ చేశారు. అక్కడి వారంతా విధులు నిర్వర్తిస్తూ ఆరునెలల వేతనాలూ పొందారు. నిర్మల్ జిల్లా అధికారులు పోస్టులు ఎప్పుడిస్తారో తెలియక, వేరేచోట విధుల్లో చేరలేక దరఖాస్తుదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఫైల్ కలెక్టరేట్‌లోనే పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

పోస్టులు, దరఖాస్తుల సంఖ్య

నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ (1), సైకాలజిస్ట్ (1), స్టాఫ్ నర్స్ (9), ఏఎన్ఎం (6), డాటా ఎంట్రీ ఆపరేటర్ కం అకౌంటెంట్ (1), రిఫ్రిజిరేటర్ మెకానిక్ (1) పోస్టుల భర్తీకి గత మార్చి ఒకటిన నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందుకోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి 2024 మార్చి 7వరకు దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబర్ 21న ప్రొవిజనల్ జాబితా విడుదల చేశారు. ఇందులో అభ్యంతరాలుంటే తెలుపాలని మరో నోటిఫికేషన్ విడుదల చేశారు. అభ్యంతరాలు స్వీకరించి నెలలు గడుస్తున్నా.. మెరిట్ జాబితా ప్రకటించడం లేదు. దీంతో ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. రిఫ్రిజిరేటర్ మెకానిక్-14, స్టాఫ్‌నర్స్-450, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్-42, సైకాలజిస్ట్-9, ఏఎన్ఎం-289, డీఈవో కం అకౌంటెంట్ పోస్ట్-103 దరఖాస్తులు వచ్చాయి. వీటికి సంబంధించి త్వరలోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.



DIST. MEDICAL & HEALTH OFFICE, NIRMA[L]
Notification No 02/2024, Dt 29.02.2024
Recruitment of District Programme Officer / Psychologist / Refrigera[tor] / ANM /DEO cum Accountant On Contract / Out Sourcing [...]
ACKNOWLEDGEMENT TO CANDIDAT[E]
Application for the post of : STAFF NURSE
Name of the Candidate :
Fathers/ Husband Name :
Date of Acknowledgement : 1-1-7-24
Signature :
Seal :

గత మార్చిలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థికి ఇచ్చిన అక్నాలెడ్జ్‌మెంట్

త్వరలోనే భర్తీ చేస్తాం



గత మార్చిలో పలు పోస్టుల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తాం. సదరు జాబితాను అధికారులకు అందజేశాం. పారదర్శకంగా పోస్టులు భర్తీ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– రాజేందర్, డీఎంహెచ్‌వో

ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న సత్యనారాయణ

నర్సాపూర్ (జి): సమత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని రాష్ట్ర హస్తకళ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర గిరిజన కో ఆపరేటివ్ ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి పేర్కొన్నారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో బుధవారం సమత ఫౌండేషన్ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సమత సుదర్శన్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. నిరుపేదలు, అనాథలు, అభాగ్యులకు అండగా సమత ఫౌండేషన్ నిలుస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. నర్సాపూర్ (జి) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని నిర్మల్ జిల్లాలో సమత ఫౌండేషన్ సేవలు విస్తరిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, ముధోల్ మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పాటిల్, నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, నాయకులు భోజరాం పటేల్, కొత్తపల్లి బుచ్చన్న, గజానంద్, చంద్రకాంత్‌యాదవ్, శంకర్ చంద్రే, కొండ్ర రమేశ్, గంగారాం, సమత ఫౌండేషన్ ఆర్గనైజర్ సాహెబ్‌రావు, సీఈవో అనిల్‌కుమార్, పీఆర్వో క్రాంతికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

నాటు వేయాలా.. వద్దా?

- డీ–19 కాలువకు అందని నీళ్లు
- సందిగ్ధంలో బాబాపూర్ రైతులు



బాబాపూర్ వద్ద బీడుగా మారిన భూమిలో రైతులు

లక్ష్మణచాంద: మండల ప్రజలకు వరప్రదాయినిగా సరస్వతి కాలువను పేర్కొంటారు. దీనికి ఉప కాలువగా ఉన్న డీ–19 కింద మండలంలోని బాబాపూర్ గ్రామానికి చెందిన రైతులకు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. సరస్వతి కాలువకు రెండో పంటకు నీరు వస్తుందనడంతో వారంతా సంతోషంగా వరి నార్లు పోసుకున్నారు. ప్రస్తుతం నార్లు నాటు దశకు ఎదిగాయి. కానీ.. వారంరోజులుగా కనకాపూర్ వాగు ద్వారా సరస్వతి కాలువ నీటిని సదర్‌మాట్‌కు వదులుతుండగా డీ–19 కాలువకు నీళ్లు రావడం లేదు. దీంతో వరి నాట్లు ఎలా వేయాలి? అని బాబాపూర్ గ్రామ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాగే మరో రెండు, మూడు రోజులు కాలువ నీళ్లు రాకుంటే వరి నార్లు ఎండిపోయే ప్రమాదముందని తెలిపారు. దీంతో తాము నష్టపోక తప్పదని వాపోతున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ మధుకర్‌ను సంప్రదించగా.. వారం కిందటి వరకు 15రోజుల దాకా మండల రైతులకు సాగునీరిచ్చామని తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు సదర్‌మాట్‌కు వారం రోజులు వాగు ద్వారా నీరు వదులుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 24నుంచి మండల రైతులకు సరస్వతి కాలువ నీరు వస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

క్లుప్తంగా

సీఆర్టీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వినంత్‌రావు


వినంత్‌రావు

ఇచ్చోడ: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఇచ్చోడ మండలానికి చెందిన జాదవ్ వినంత్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏల పరిధిలో సీఆర్టీల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖలో సీఆర్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

యువకుడి రిమాండ్

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎల్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. బోథ్‌కు చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించాడు. యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. యువకుడి బంధువులైన మరో నలుగురిపై కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

బెజ్జూర్: అటవీ జంతువును వేటాడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ అజ్మీరా మోహన్ నాయక్ తెలిపారు. మండలంలోని ముంజంపల్లికి చెందిన తుమ్మిడే శంకర్, బాలేపల్లి రాకేష్ మంగళవారం అటవీ జంతువులను వేటాడే దబ్బా (మీటు) ద్వారా నీలుగాయిని హతమార్చారనే పక్కా సమాచారం మేరకు రాత్రి ఇంట్లో సోదాలు నిర్వహించగా వండిన అటవీ జంతువు మాంసం లభ్యమైంది. దీంతో వారిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

నర్సాపూర్(జి): ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయి కిరణ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని నసీరాబాద్ గ్రామ 61వ జాతీయ రహదారిపై నిర్మల్ నుండి భైంసా వెళ్తున్న ఆర్టీసీ బస్సును భైంసా నుంచి నిర్మల్ వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. బస్సులో ప్రయాణిస్తున్న దిలావర్‌పూర్ గ్రామవాసి నర్సమ్మకు గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఎస్టీపీపీ కార్మికుడికి గాయాలు

జైపూర్: కారు ఢీకొట్టిన ఘటనలో ఎస్టీపీపీ కార్మికుడికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న గూడూరి అజయ్ విధుల్లో భాగంగా ఉదయం పవర్ ప్లాంటుకు వెళ్లి మధ్యాహ్నం భోజన సమయంలో బైక్‌పై బయటికి వస్తుండగా ఎస్టీపీపీలో ఎస్సీ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సింగరేణి అధికారి ప్రసాద్ తన కారులో బయటకు వస్తుండగా గెస్ట్‌హౌజ్ క్రాస్ వద్ద బైక్ను ఢీకొట్టాడు. ఘటనలో అజయ్‌కు గాయాలు కావడంతో మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పక్షుల లెక్క పక్కా

- 'కవ్వాల్'లో పక్షుల సర్వే
- ఏడు బృందాలు.. 28 మంది సభ్యులు
- ఈ నెల 24 నుంచి మూడురోజుల పాటు గణన






కవ్వాల్ టైగర్‌జోన్‌లోని పక్షులు

జన్నారం(ఖానాపూర్): పక్షుల లెక్కకు వేళయింది. మనుషులు, వన్యప్రాణుల వలే పక్షుల లెక్కను పక్కాగా చేయాలని అటవీశాఖ అధికారులు యోచిస్తున్నారు. ఇందులో భాగంగా కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లో పక్షి గణన(సర్వే)కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లోని 3 అటవీ రేంజ్‌లు, 14 అటవీ సెక్షన్‌లు, 40 అటవీ బీట్‌లలో ఈ గణన కొనసాగనుంది. డివిజన్ పరిధిలోని పక్షులు, అందులో విదేశీ పక్షులు, స్వదేశీ పక్షులు, వలస పక్షులు, తదితర విషయాలను లెక్కించనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నెల 24 నుంచి సర్వే ప్రారంభించనుండగా 26వ తేదీ వరకు గణన కొనసాగనుంది. అయితే ముందుగా డివిజన్‌లో పూర్తి చేసి ఆతర్వాత కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని అన్ని అటవీ రేంజ్‌లలో ఈ గణన చేపట్టనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పూర్వకాలం నుంచే గణన

పూర్వకాలం నుంచే పక్షుల లెక్కింపు జరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. 1930లో హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్న సమయంలో సలీం అలీ అనే పక్షి ప్రేమికుడు పక్షి గణన చేశారు. ఆ సమయంలో కవ్వాల్ అభయారణ్యంలోని దట్టమైన అడవుల్లో పర్యటించి పక్షులను లెక్కించినట్లు చెబుతున్నారు. అనంతరం 2005, 2020లో పక్షి గణన జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే ప్రస్తుతం జరుగనున్న గణన ప్రపంచంలో ఎవ్వరైనా చూసుకునే విధంగా ×ఈ బర్డ్£ అనే యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. గణన సమయంలో పక్షుల ఫొటోలు, రకాలు, వాటి శాస్త్రీయ నామం, తదితర అంశాలను జత చేయడం వల్ల పక్షులను గుర్తించే అవకాశం ఉంది.

ఏడు టీంలు 28 మంది సభ్యులు

28 మంది వ్యక్తులను ఏడు టీంలుగా విభజించి పక్షి గణన చేయనున్నారు. డబ్ల్యూ.డబ్ల్యూ.ఎఫ్ సభ్యుల సహకారం తీసుకోనున్నారు. ఒక్కోటీంలో నలుగురు సభ్యులు ఉంటారు. బర్డ్ ఎక్స్‌పర్ట్ (పక్షి నిపుణుడు), ఒక వలంటీర్, సంబంధిత బీట్, లేదా సెక్షన్ అధికారి, ఒక బేస్‌క్యాంపు సిబ్బంది కలిసి ఒక టీంగా ఏర్పడి గణన చేయనున్నారు. ఒక్కోటీం సభ్యులు ఒక్కో బీట్ పరిధిలో పర్యటిస్తూ పక్షులను గుర్తిస్తారు.

రోజుకు రెండు బీట్లు

పక్షి గణన చేసే సభ్యులు ఒక్కో టీం రోజుకు రెండు బీట్‌లు పూర్తి చేస్తారు. ఉదయం 6:30 గంటలకు గణన ప్రారంభించి 10 గంటలకు ఒక్క బీట్ పూర్తి చేస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు అదే టీం మారో బీట్‌లో సర్వే చేస్తారు. బీట్ మారినప్పుడు బీట్ అధికారి, బేస్‌క్యాంపు సిబ్బంది మారుతారు. మిగతా వారు అలాగే ఉంటారు. ఇలా ప్రతీరోజు ఒక్కో టీం రెండు బీట్‌లలో సర్వే చేస్తారు. రోజుకు 14 బీట్‌లలో సర్వే చేసి మూడు రోజుల్లో డివిజన్‌లోని 40 బీట్‌లను పూర్తి చేస్తారని అధికారులు తెలిపారు. బీట్ పరిధిలో పక్షుల ఆవాసాల వద్ద, దట్టమైన చెట్ల పొదలు, నీటి కుంటలు తదితర ప్రదేశాల్లో పర్యటిస్తారు. ప్రతీ బీట్‌లో మూడు కిలోమీటర్ల దూరం వరకు తిరిగి పక్షులను గుర్తిస్తారు.

ఫిబ్రవరిలో వివరాలు విడుదల

పక్షుల సర్వేలో భాగంగా రోజువారి వివరాలను సేకరించిన టీం సభ్యులు చివరి రోజు అన్నీ కలిపి ఏరకం పక్షులు ఎన్ని ఉన్నాయని లెక్కిస్తారు. అటవీశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో పూర్తి పక్షుల వివరాలను వెల్లడిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి మాసంలో వివరిస్తామని అట వీశాఖ అధికారులు తెలిపారు. అయితే 'ఈ బర్డ్' యాప్‌లో జన్నారం అటవీ డివిజన్ పేరున ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించి అందులో పక్షుల వివరాలు పొందుపర్చనున్నట్లు తెలిపారు. దీంతో డివిజన్‌లో ఎన్ని రకాలు, ఏఏ రకాల పక్షులు ఉన్నాయని ప్రపంచ వ్యాప్తంగా తెలుస్తుందన్నారు. డివిజన్‌లో వలస పక్షులు, విదేశీ, స్వదేశీ పక్షులు, అంతరిస్తున్న పక్షులు, ఇక్కడికి చేరిన కొత్తరకం పక్షుల వివరాలు తెలుస్తాయన్నారు.

పక్షుల వివరాలు తెలిపేందుకే..



కవ్వాల్ టైగర్‌జోన్‌లో వన్యప్రాణులతో పాటు పక్షులు కూడా ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇటీవల నిర్వహించిన బర్డ్‌వాక్‌లో అనేక రకాల పక్షులను గుర్తించాం. జన్నారం అటవీ డివిజన్‌లో అంతరిస్తున్న పక్షులు, వలస పక్షులు, విదేశీ, స్వదేశీ పక్షులు, వాటి విశేషాలను గుర్తించి ప్రపంచానికి తెలియజేయడానికి సర్వే నిర్వహిస్తున్నాం. మూడు రోజుల్లో సర్వే పూర్తిచేస్తాం. వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరుస్తాం. – శివ్ ఆశిష్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, మంచిర్యాల

వసంత పంచమి వేడుకలపై సమీక్ష


మాట్లాడుతున్న అధికారులు

బాసర: కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో బుధవారం ఫిబ్రవరి 1నుంచి 3వరకు నిర్వహించనున్న వసంత పంచమి వేడుకలపై ఆర్డీవో కోమల్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని వివిధ శాఖల అధికారులకు సూచించారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎస్సై గణేశ్, ఆలయ కార్యనిర్వహణాధికారి నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముడు అరెస్టయ్యాడని రూ.30 వేలు స్వాహా

ఆదిలాబాద్: తమ్ముడు అరెస్ట్ అయ్యాడని అన్నను మోసగించి రూ.30 వేలు స్వాహా చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని తిర్పెల్లి కాలనీకి చెందిన అఫ్రోజ్‌ఖాన్‌కు ఈ నెల 16న అతని తమ్ముడు ఒక కేసులో అరెస్టయ్యాడని ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు. విడుదల చేయాలంటే వెంటనే రూ.60 వేలు పంపించాలని డిమాండ్ చేశాడు. ఆందోళన చెందిన అఫ్రోజ్ ఖాన్ అతనికి రూ.30 వేలు నగదు బదిలీ చేశాడు. అయితే తమ్ముడు అరెస్టు కాలేదని, క్షేమంగానే ఉన్నాడని తెలుసుకోవడంతో మోసపోయానని గ్రహించి బుధవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

కలప స్మగ్లింగ్ నిందితుల అరెస్ట్


పట్టుకున్న వాహనం, నిందితులతో అధికారులు

ఖానాపూర్: మండలంలోని ఖానాపూర్, ఎక్బాల్‌పూర్ అటవీ బీట్‌లలో ప్రధాన రహదారి పక్కనే గత నెల 19న కలప స్మగ్లింగ్‌కు పాల్పడిన పలువురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎఫ్ఆర్వో కిరణ్‌కుమార్ తెలిపారు. ఖానాపూర్ మండలంలోని ప్రధాన రహదారి పక్కన అధునాతన యంత్రంతో భారీ వృక్షాలను పడగొట్టి రూ.25 లక్షల విలువైన కలప తరలించిన 12 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కలప స్మగ్లింగ్ కోసం నిందితులు మూడు కార్లతో పాటు పవర్ షా అనే కలప కోత యంత్రాన్ని వినియోగించగా ఒక కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల గత నేర చరిత్ర ఆధారంగా ఆయా చోట్ల గల పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా సైతం ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

కలప స్మగ్లింగ్‌లో పాల్గొన్న కడెం మండలం దోస్తునగర్‌కు చెందిన జి.నాగేశ్, మైసంపేట్‌కు చెందిన డి.శ్రీనివాస్, మంచిర్యాలకు చెందిన ఎం.రాజ్‌గోపాల్‌తో పాటు డూప్లీకేట్ నంబర్ ప్లేట్‌తో ఉన్న ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. కడెం మండలం కల్లెడ గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు ఏ.శేఖర్‌తో పాటు జన్నారం మండలం టీజీపల్లెకు చెందిన సంజీవ్, సతీశ్, తదితరులను పట్టుకోవాల్సి ఉందన్నారు. కలపను మంచిర్యాలకు చెందిన జగదీశ్వర్‌తో పాటు కరీంనగర్‌కు చెందిన మహేందర్‌రెడ్డికి విక్రయించగా ఇరువురిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. కలప స్మగ్లింగ్ కేసు విషయమై విచారణ నిమిత్తం కరీంనగర్ వెళ్లివస్తున్న అటవీ అధికారుల వాహనాన్ని జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం దోనూర్ వద్ద ఛేజింగ్ చేసిన స్మగ్లర్లు బ్రీజా వాహనంతో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. దీనిపై డయల్ 100కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రవీందర్, ఎఫ్‌బీవోలు నరేందర్, ముత్యం, రాంచందర్, మోహిద్, తదితరులు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్నిప్రమాదం


పాక్షికంగా దెబ్బతిన్న యంత్రాలు

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిల్లులో బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి అగ్ని ప్రమాదం జరిగింది. రబ్బరు పట్టాలపై వెళ్తున్న పత్తికి రబ్బరు పట్టా రాపిడికి గురై యంత్రాల్లో ఉన్న పత్తికి నిప్పంటుకుని దట్టమైన పొగలు వ్యాపించాయి. అప్రమత్తమైన సిబ్బంది అత్యవసర అగ్నినివారణ పైప్‌లైన్ల ద్వారా మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా ఆదిలాబాద్ నుంచి వచ్చిన స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జైయంత్‌రావ్ పర్యవేక్షణలో సిబ్బంది పూర్తిగా మంటలను ఆర్పివేశారు. యంత్రాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, సీసీఐకి చెందిన సుమారు 3 క్వింటాళ్ల పత్తి దెబ్బతిన్నట్లు జిన్నింగ్ యజమాని వినోద్ సేట్, సీసీఐ పత్తి కొనుగోలు అధికారి గణేశ్ తెలిపారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో గల దర్శన్ జిన్నింగ్ మిల్లులో బుధవారం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించినట్లు సిబ్బంది తెలిపారు. వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పి వేయడంతో ఆస్తి నష్టం జరగలేదన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తీగల్‌పహడ్‌లో దుర్గం వెంకటేశ్వర్లును కులం పేరుతో దూషించిన కందుల ప్రశాంత్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న వెంకటేశ్వర్లు ఇంటి పక్కన ఉండే జాలి శ్రావణి సాఫ్ట్‌వేర్ ఉద్యోగ ఇంటర్వ్యూ కోసం ల్యాప్‌టాప్ తీసుకుని తిరిగి ఇచ్చింది. అదేరోజు మధ్యాహ్నం వెంకటేశ్వర్లు తన మిత్రులతో కలిసి ఇంట్లో ఉండగా కందుల ప్రశాంత్ ఇంట్లోకి ప్రవేశించి ల్యాప్‌టాప్, మొబైల్‌ఫోన్ ఇవ్వు, లేకపోతే చంపుతానని బెదిరిస్తూ కులంపేరుతో దూషించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై సుగుణాకర్ ఈనెల 20న ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని జాఫర్‌నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడకు చెందిన ఎంఏ రహీమ్ కుమార్తె ఉజ్మఅంజుమ్ (24)కు మంచిర్యాలలోని జాఫర్‌నగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి సాజీద్ హుస్సేన్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలకు కొంతకాలంగా గొడవ నడుస్తోంది. కుమారుడు తనకు పుట్టలేదని సాజీద్ తరచూ భార్యను వేధించేవాడు. ఆమె అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రికి తీసుకెళ్లమని భర్తను కోరగా.. 'నేను తీసుకెళ్లను.. చచ్చిపో' అని అనడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుంది. తమ కుమార్తె మృతికి కారణమైన సాజీద్‌పై చర్యలు తీసుకోవాలని మృతురాలి తండ్రి రహీమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చుక్కలదుప్పి మాంసంతో దొరికిన వ్యక్తి అరెస్టు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఉమాపతికుంటలో చుక్కలదుప్పి మాంసంతో దొరికిన వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్లు బీర్సాయిపేట్ అటవీ రేంజ్ అధికారి అరుణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఉమాపతి కుంటకు వెళ్లి గ్రామానికి చెందిన తొడసం చిన్ను పంట చేనుకు వెళ్లారు. అక్కడ చిన్ను మాంసం ముక్కలు ఆరబెడుతూ కనిపించాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి రేంజి అధికారి సీతారాం, బీట్ అధికారులు రాంకుమార్, కోసేరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఈజ్‌గాం పోలీసులు తెలిపారు. రాస్పెల్లి గ్రామానికి చెందిన ఇనుముల శశికాంత్ (22) బైక్‌పై కాగజ్‌నగర్ నుంచి రాస్పెల్లికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

బ్లేడుతో గొంతు కోసుకున్న యువకుడు


ప్రథమ చికిత్స చేస్తున్న 108 సిబ్బంది

కడెం: మండలంలోని ఉడుంపూర్‌లో బుధవారం ఓ యువకుడు బ్లేడుతో గొంతు, చేయి కోసుకుని హల్‌చల్ చేశాడు. యువకుడి గొంతు, చేతి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ మురళి, పైలట్ రమేశ్ ప్రథమ చికిత్స చేసి ఉట్నూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడు ఉట్నూర్ సుభాష్‌నగర్‌కు చెందిన కుడిమేత వరుణ్ అని సిబ్బంది తెలిపారు. ఖానాపూర్ సీఐ సైదారావు ఉడుంపూర్ గ్రామాన్ని సందర్శించారు. ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. అయితే ఈ ఘటనకు సంబంధించి కారణాలు తెలియాల్సిఉంది.

కోతులకు ఆహారం వేసిన ఇరువురికి జరిమానా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం లక్సెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలోని పాతమంచిర్యాల అటవీ సెక్షన్‌లో గల తిమ్మాపూర్ బీట్ అడవిలో రోడ్డు పక్కన ఉన్న కోతులకు ఆహారం వేస్తున్న ఇరువురికి బుధవారం అటవీ అధికారులు జరిమానా విధించారు. మంచిర్యాలలోని హమాలీవాడకు చెందిన మిరియాల శివ, గడ్డం జగన్ కోతులకు ఆహారం వేస్తుండగా అటవీశాఖ అధికారులు వారిని ఆపి కోతులకు ఆహారం వేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్వో ఆదేశాల మేరకు రూ.4 వేల జరిమానా విధించినట్లు ఎఫ్ఎస్‌వో అతావుల్లా, ఎఫ్‌బీఓలు సంతోశ్, రాజేందర్ తెలిపారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన బాలికను కిడ్నాప్ చేసిన కేసులో ఒకరిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్ తెలిపారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనికి చెందిన కుటుంబ సభ్యులు బాలిక అదృశ్యమైనట్లు ఈ నెల 20న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా తలమడుగు మండలానికి చెందిన పవన్ కుమార్ బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చిన్న వయస్సులోనే పెద్ద సాయం

- సంరోహ స్వచ్ఛంద సంస్థ పేరిట సామాజిక సేవ
- కొలాంగూడను దత్తత తీసుకున్న సుజయ్‌రెడ్డి


అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న సుజయ్‌రెడ్డి

ఇచ్చోడ: చిన్న వయస్సులోనే పెద్ద మనసుతో సామాజిక సేవ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన సురకంటి సుజయ్‌రెడ్డి. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్న సుజయ్‌రెడ్డి తొమ్మిదో తరగతి చదువుతున్న సమయంలోనే కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో సంరోహ స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. ఇంటర్ చదువుతూనే ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని కొలాంగూడను దత్తత తీసుకున్నాడు. చిన్నారుల్లో పోషకాహారలోపం, పెద్దల్లో నిరక్షరాస్యతను గుర్తించాడు. న్యూట్రిషన్ ప్రాజెక్టు ద్వారా 38 మంది చిన్నారులకు రెండేళ్లుగా రోజుకు ప్రతీ ఒక్కరికి 200 మిల్లీలీటర్ల పాలతో పాటు సరిపడా ఆకుకూరలు అందజేస్తున్నాడు. వారికి మెరుగైన ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నాడు. సెలవుల్లో ఇంటికి వచ్చిన ప్రతీసారి మారుమూల గిరిజన గ్రామాల్లో పర్యటిస్తూ గిరిజన ఆదివాసీ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై అధ్యయనం చేస్తున్నాడు. పెద్దల్లో నిరక్షరాస్యతను గుర్తించి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ తనవంతు కృషి చేస్తున్నాడు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కొలాంగూడలో నివాసముంటున్న చిన్నారుల తల్లిదండ్రులు నిరక్షరాస్యులు కావడంతో వారికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్నాడు. ప్రతీ ఒక్కరికి వివిధ బ్యాంకులలో సేవింగ్ ఖాతాలు తెరిపించాడు. వ్యవసాయం లేదా వ్యవసాయేతర పనుల ద్వార వచ్చిన దాంట్లో కొంత డబ్బును బ్యాంక్‌లో జమ చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పిస్తున్నాడు. ప్రతీ కుటుంబాన్ని ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేయిస్తున్నాడు.

భార్యాభర్తల పంచాయితీలో గొడవ

- రోడ్డు వెంట పరుగెత్తుకుంటూ ఇరువర్గాల దాడులు
- పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీసిన బాధితులు


దాడికి పాల్పడుతున్న ఇరువర్గాలు

దండేపల్లి: దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు కొద్దిదూరంలోనే సహకార సంఘం కార్యాలయ భవనం సమీపంలో బుధవారం భార్యాభర్తల (వెల్గనూర్‌కు చెందిన భార్య, ధర్మపురి మండలం దోనూర్‌కు చెందిన భర్త) పంచాయితీ జరిగింది. వివాదం తలెత్తడంతో ఇరువర్గాలకు చెందినవారు దాడులకు పాల్పడ్డారు. పంచాయితీ పెద్దలు చర్చించుకుని బయటకు వచ్చేక్రమంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రెండు వాహనాల్లో వచ్చి పంచాయితీ పెద్దలు, బంధువులు ఎవరు దొరికితే వారిని ఇష్టారీతిన సినిమా స్టైల్‌లో కొట్టారు. దీంతో వారంతా రక్షణ కోసం సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీశారు. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా పంచాయితీలో గొడవ జరిగింది వాస్తవమేనని, ఇందులో నలుగురికి గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించామన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.

గంజాయి కేసులో నలుగురికి జైలు

కెరమెరి: గంజాయి సాగుచేస్తూ విక్రయిస్తున్న నలుగురికి కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ బుధవారం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం 21 సెప్టెంబర్ 2021న అప్పటి ఎస్సై రమేశ్ పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గోయగాం నుంచి వస్తున్న ఆటోను తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తుల వద్ద కిలో గంజాయి కలిగిన ఒక బ్యాగు లభించింది. కదవండి ప్రవీణ్, గొండ ప్రణయ్, చౌదరి మణికంఠ గంజాయిని మొహర్లే మధుకర్‌కు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. మధుకర్‌ను విచారించగా ఇంట్లో రెండు కిలోల గంజాయి, వ్యవసాయ క్షేత్రంలో గంజాయి మొక్కలు లభించాయి. సీఐ సుధాకర్ కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఏడాది జైలు, రూ.పదివేల జరిమానా, మధుకర్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్సై వివరించారు.

రూ.74 లక్షల విలువైన గంజాయి దహనం


గంజాయిని దహనం చేస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన సుమారు రూ.74 లక్షల విలువైన 117.8 కిలోల గంజాయిని బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని వెంకటరమణ ఇన్సినిరేటర్స్ సెంటర్ వద్ద దహనం చేశారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో 53 కేసుల్లో నిల్వ ఉన్న గంజాయిని పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయి సాగు చేస్తూ, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సాగు చేసినా, రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.